క్లుప్తంగా

పోలింగ్ స్టేషన్లలో సదుపాయాలు



పొట్టిలంక పోలింగ్ కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న జేసీ తేజ్‌భరత్

కడియం: ఎన్నికలకు సంబంధించి అన్ని పోలింగ్ స్టేషన్లలోనూ అవసరమైన సదుపాయాలు కల్పించాలని జేసీ తేజ్ భరత్ ఆదేశించారు. ఆయ శనివారం మండలంలోని పొట్టిలంక పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిబంధనల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సదుపాయాలు ఏర్పాటు చేసేలా సంబంధిత సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. అనంతరం జాతీయ రహదారిపై పొట్టిలంక వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించి, వాహన తనిఖీల విషయంలో సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్లానింగ్ అధికారి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ వార్షిక మరమ్మతుల్లో భాగంగా సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ శనివారం తెలిపారు. నేతాజీ నగర్, జేఎల్‌బీ నగర్, బృందావన కాలనీ, ఏసీబీ కాలనీ, రాఘవేంద్ర నగర్ కాలనీ, బొమ్మూరు చెరువు, వెంకటగిరికొండ నుంచి బాలాజీపేట సెంటర్ వరకూ, నవభారత్ నగర్, వెంకటేశ్వర కాలనీ ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు.

ఏపీటీఎఫ్ నగర కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

కంబాలచెరువు: స్థానిక నెహ్రూ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏపీటీఎఫ్ రాజమండ్రి నగర శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ప్రస్తుత నగర శాఖ అధ్యక్షుడు డేవిడ్ లివింగ్‌స్టన్ దీనికి అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి గౌరీ శంకర్ వార్షిక నివేదికను సమర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ ఎన్నికలో ఏపీటీఎఫ్ నగర శాఖ ప్రధాన కార్యదర్శిగా ఎస్.గౌరీ శంకర్, అధ్యక్షుడిగా బి.తాతారావు, గౌరవాధ్యక్షుడిగా ఎం.సత్యనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కేవీవీ సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్లుగా పి.వరలక్ష్మి, పి.బాపిరాజు, అడిషనల్ సెక్రటరీగా జీఎస్ఎస్ శ్రీనివాస్, సెక్రటరీలుగా బి.ఉషాకాంత, ముంగండి పద్మజ, జి.నాగేంద్ర ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సీఎం జగన్‌కు అండగా నిలుద్దాం

కడియం: వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకుడు గిరజాల వీర్రాజు, రాజమహేంద్రవరం మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్ కోరారు. స్థానిక గిరజాల ఇంటి వద్ద శనివారం ఆటో డ్రైవర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలకృష్ణ గెలుపునకు రానున్న ఎన్నికల్లో ఆటో కార్మికులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు ఓగిరాల రాజు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి వాలీబాల్ శిక్షణ

ప్రకాశం నగర్: రాజమండ్రి వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే ఒకటో తేదీ బుధవారం నుంచి స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని పరిమి రామచంద్రరావు మెమోరియల్ ఫ్లడ్ లైట్ వాలీబాల్ కోర్టులో వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని అసోసియేషన్ కార్యదర్శి కె.యశ్వంత్ శనివారం ప్రకటనలో తెలిపారు. పదేళ్లు పైబడిన బాలురు, బాలికలు శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి కలవారు బుధవారం ఉదయం ఆరు గంటలకు ఆధార్ కార్డు జిరాక్స్‌తో హాజరుకావాలని కోరారు.

అథ్లెటిక్స్ శిక్షణ ప్రారంభం

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రి అథ్లెటిక్ అసోసియేషన్ సహకారంతో శనివారం స్థానిక నాగుల చెరువు బజార్‌లోని మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ శిక్షణ శిబిరాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.త్రిమూర్తులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పి.రాజు, కుమార్ బాబు, అసోసియేషన్ కార్యదర్శి ఎస్.నాగరాజు, ఎండీ.ఇబ్రహీం పాల్గొన్నారు.

29న షర్మిల పర్యటన

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల ప్రచారంలో భాగంగా పీసీసీ చీఫ్ షర్మిల సోమవారం సాయంత్రం రాజమహేంద్రవరం రానున్నారని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6 గంటల సమయంలో నగరంలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం కోటిపల్లి బస్టాండ్ వద్ద సమావేశం జరుగుతుందన్నారు.

హామీలు నెరవేర్చాం.. అండగా ఉంటాం..

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- 26వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



26వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ



ప్రచారంలో భాగంగా ఇన్నీసుపేటలో టిఫిన్ బండి వద్ద పెసరట్టు వేస్తున్న మంత్రి వేణు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని, అందుకే ప్రజలను ధైర్యంగా ఓట్లు అడుగుతున్నామని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని 26వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ మిరపల శ్యామలరావు, జేసీఎస్ కన్వీనర్ కొప్పిసెట్టి ప్రసాద్‌బాబు (రాజమౌళి) ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. మంత్రి వేణు మాట్లాడుతూ సీఎం జగన్ 58 నెలల కాలంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించారని, రాబోవు ఎన్నికలలో ప్రజలు మరోసారి ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలలో నిత్యం ఉంటూ, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇన్నీసుపేటలో టిఫిన్ బండి వద్ద పెసరట్లు వేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత, మింది నాగేంద్ర, బట్లంకి ప్రకాష్, అంగాడి సత్యప్రియ, కాపు భాను, పేంట శివ, చీకురుమిల్లి చిన్నా, కొల్లి దీపు, షేక్ ఇమామ్, చాప రాజా, ఓదూరి రామకృష్ణ, దమ్ము ప్రసాద్, కాటం సుస్మిత, కొండపల్లి పట్టియ్య, వంశీ, బిల్డర్ చిన్నా, దుంపా చంద్రారెడ్డి, బాషా, దారపురెడ్డి రామకృష్ణ, కేబుల్ శ్రీను, పడమటి కామరాజు, నాగమణి, బూర కనకలింగేశ్వరరావు పాల్గొన్నారు.

నగరంలో 24 గంటలూ తాగునీరు

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ అభ్యర్థి భరత్‌రామ్



ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శివరామ సుబ్రహ్మణ్యంతో ఎంపీ భరత్‌రామ్



ఎన్నికల ప్రచారంలో 38వ డివిజన్ సీతంపేటలో బట్టలను ఇస్త్రీ చేస్తున్న ఎంపీ భరత్‌రామ్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: సిటీ ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నగరంలో 24 గంటలూ రక్షిత తాగునీరు అందిస్తానని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని 36, 38, 39 డివిజన్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. జగనన్న మళ్లీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతాయని, మరే పార్టీ వచ్చినా ఈ సంక్షేమ పథకాలేవీ కొనసాగవన్నారు. గతంలో చంద్రబాబు పాలనలో ఇన్ని పథకాలు లేవన్నారు. జగనన్న నాయకత్వంలో ఏపీ దేశంలోని అన్ని రాష్ట్రాలకూ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పార్టీ ఇయర్స్ ఎక్స్‌పీరియన్స్ అని గొప్పలు చెప్పుకోవడం తప్పిస్తే రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. చంద్రబాబు ఆరాటం, తపన కేవలం అధికారం కోసమేనన్న విషయాన్ని ప్రజలు గుర్తించారన్నారు. ఆయన మాటలు, వాగ్దానాలన్నీ బూటకమేనన్నారు. రాజకీయాలను వ్యాపారంగా మార్చుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే చంద్రబాబు వంటి నాయకులు మనకు అవసరం లేదన్నారు. ఎంపీగా నగరాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేశానని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే నగర వాసులకు తాగునీటి సమస్య లేకుండా చేస్తానన్నారు. రాజమహేంద్రవరాన్ని విశ్వనగరంగా చూడాలన్నదే తన లక్ష్యమని తెలిపారు.

వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం



పిడింగొయ్యిలో మంత్రి వేణుకు హారతి ఇస్తున్న మహిళలు

- జగన్ ప్రభుత్వంలో అందరి సంక్షేమం
- పిడింగొయ్యిలో మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకూ లబ్ధి చేకూరేలా సీఎం జగన్ రూపొందించిన వైఎస్సార్ సీపీ ఎన్నికల మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. 2019 ఎన్నికల సమయంలో విడుదల చేసిన మేనిఫెస్టోను జగన్ నూరుశాతం అమలు చేశారన్నారు. ఇప్పుడు ఆ నవరత్నాలను కొనసాగించడంతో పాటు, అమలు చేయగలిగిన పథకాలను మేనిఫెస్టోలో చేర్చారన్నారు. పిడింగొయ్యి పంచాయతీ పరిధిలో సొసైటీ అధ్యక్షుడు బొప్పన సుబ్బారావు ఆధ్వర్యంలో జైహింద్ నగర్, వెంకటగిరి, బాపూజీ నగర్ ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి పర్యటించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, తనను ఎమ్మెల్యేగా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించాలని ప్రజలను కోరారు. జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. ఏదో ఒక పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. గత ఐదేళ్లలో తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలకు మించి, ప్రజలకు మరింత మేలు చేసేలా జగనన్న ప్రకటించిన మేనిఫెస్టో ఉందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, చీరా రాజు, రాఘవ రెడ్డి, పిల్లా లక్ష్మణరావు, మేడి త్రిమూర్తులు, సుందరపల్లి అనిల్, సిరసపల్లి శంకరరావు, ఇబ్రహీం బాషా, జాజుల శ్రీను, రేలంగి పెద్ద సత్యనారాయణ, వేముల ఏసుబాబు, సియాద్రి శిరీషా, రాంబాబు, కణితి సత్యనారాయణ, రాంబాబు, దుర్గారావు, పెయ్యల రాజేష్, నక్కా రాజేంద్ర, బండి నాగేశ్వరరావు కె.సంతోష్, పేట రామకృష్ణ పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి



19వ డివిజన్‌లో ఇస్త్రీ చేస్తున్న చెల్లుబోయిన వరలక్ష్మి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని, ప్రతి ఒక్కరూ మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సతీమణి వరలక్ష్మి ప్రజలను కోరారు. 19వ డివిజన్‌లో ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ సమయంలో ఇస్త్రీ చేస్తున్న మహిళ నుంచి పెట్టె తీసుకుని కొద్దిసేపు ఇస్త్రీ చేశారు. రాబోవు ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు రోటరీ క్లబ్ అవార్డులు



రైల్వే టీటీఐ కిరణ్ కుమార్‌ను సత్కరిస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: సేవాదృక్పథంతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సిటీ రాజమండ్రి తరఫున సత్కరిస్తున్నామని రోటరీ క్లబ్ పూర్వపు డిస్ట్రిక్ట్ గవర్నర్ సీఎస్ వెంకటరావు తెలిపారు. నగరంలో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ ఆధ్వర్యంలో శనివారం వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులకు ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డులు అందించారు. జేఎన్ రోడ్డులోని ఆంధ్రకేసరి సెంటినరీ రోటరీ రివర్ సిటీ హాల్‌లో సుమారు 28 మందిని సన్మానించారు. వారిలో రైల్వే, ఆర్టీసీ, వైద్యం, పోలీస్, విద్య, తపాలా, క్రీడాకారులు, పారిశుధ్య కార్మికులు, యోగా టీచర్లు, విద్యుత్ ఉద్యోగులు ఉన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు కె.కాశీ విశ్వేశ్వరరావు, సుంకర నాగేంద్ర కిశోర్, కేశవభట్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కేశవభట్ల శ్రీనివాసరావు, రోటరీ అధ్యక్షుడు వీవీఎస్ కృష్ణారావు, రైల్వే సీటీఐ చంద్రమౌళి పాల్గొన్నారు.

సెబ్ సిబ్బంది విస్తృత దాడులు



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ డ్రమ్ములతో సెబ్ నార్త్ స్టేషన్ సిబ్బంది



స్వాధీనం చేసుకున్న సామగ్రితో సౌత్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ, సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వెంకటనగరం పరిధిలోని లంకల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సిబ్బంది శనివారం విస్తృత దాడులు నిర్వహించారు. తూర్పు లంక పోశమ్మగుడి వెనుక పొదలలో దాచిన 1800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే నడిమిలంకలో 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రెండు కేసులు నమోదు చేసి నిందితులు కోసం విచారణ చేపడతున్నామని సెబ్ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎస్ నిక్సన్ తెలిపారు. ఈ దాడులలో నార్త్ స్టేషన్, స్పెషల్ యూనిట్ మంగళగిరి సిబ్బంది పాల్గొన్నారు.

సెబ్ సౌత్‌స్టేషన్ పరిధిలో శనివారం విస్తృతదాడులు నిర్వహించి 1600 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసి, 80 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు. రాజానగరం మండలం రాధేయపాలేనికి చెందిన గుడాల వెంకటలక్ష్మి, కానవరానికి చెందిన మేడిశెట్టి రాంబాబును అరెస్టు చేశామన్నారు. గుడాల వీరబాబు పరారీలో ఉన్నాడని తెలిపారు.

నగరానికి జనచైతన్య యాత్ర

ప్రకాశం నగర్: నెల్లూరు జిల్లా నుంచి ఏప్రిల్ 14న ప్రారంభమైన జన చైతన్య యాత్ర శనివారం నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, అరుణోదయ సాంస్కృతిక సామాఖ్య, ప్రగతిశీల మహిళా సంఘం పీవోడబ్ల్యూ (స్త్రీ విముక్తి), పీడీఎస్‌యూ (విజృంభణ) సంఘాల నాయకులు మాట్లాడారు. నెల్లూరు, ప్రకాశం, ఒంగోలు, గుంటూరు, కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాలో ఈ యాత్ర సాగుతున్న క్రమంలో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. వీటిపై ప్రజలను చైతన్యం చేసి పాలకులపై ఉద్యమం చేపడతామని తెలిపారు. సమావేశంలో కర్నాకుల వీరాంజనేయులు, కొండ దుర్గారావు, సింగోతు నాగేందర్ రావు, బి.రమేష్, వల్లూరి రాజబాబు పాల్గొన్నారు.

తాటి ముంజెలు.. పుష్కలంగా పోషకాలు

- వేసవి ఎండల నుంచి ఉపశమనం
- రోడ్ల పక్కనే విక్రయాలు



తాటికాయల నుంచి ముంజెలు తీస్తున్న వ్యాపారి



తాటి ముంజెలు

రాజానగరం: తాటి ముంజెలకు వేసవి కాలంలో విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ఎండల తీవ్రత నుంచి ఉపశమనానికి ప్రకృతి ప్రసాదించిన వరం ఇవి. వేసవి సీజన్‌లో మాత్రమే దొరికే వీటిని విక్రయిస్తూ ఎంతోమంది జీవనోపాధి పొందుతున్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాలలో రైతు బిడ్డలకు మాత్రమే దొరికే ఈ తాటి ముంజెలు ప్రస్తుతం దారి పొడవునా లభిస్తున్నాయి. వేసవి సెలవులకు వచ్చిన స్నేహితులు, బంధువులతో కలిసి సరదాగా పొలాలకు వెళ్లిన భూస్వాముల పిల్లలు తమ పాలికాపుల ద్వారా తాటిచెట్ల నుంచి ముంజులు కోయించి ఆరగించేవారు. ఈ కాలంలో పొలాలకు వెళ్లి ముంజెలను ఆరగించేందుకు తీరిక ఎవరికీ ఉండటం లేదు. భూస్వాముల పిల్లలైనా, వారి స్నేహితులైనా పొలాల్లో అడుగు పెట్టే రోజులు పోయాయి. అక్షరాభ్యాసంతోనే పోటీతత్వాన్ని అలవర్చుకుంటున్న ఈ రోజుల్లో సామాన్యుల పిల్లలు సైతం పుస్తకాలకు అతుక్కుపోతుంటే ఇక భూస్వాముల పిల్లల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. పట్టణాల్లో హాస్టళ్లలో చేర్చి మరీ చదివిస్తుంటే ఇక పొలాల గురించి, తాటి ముంజెల రుచి గురించి తెలుసుకుని ఆస్వాదించే తీరిక వారికి ఎక్కడుంటుంది. అందుకే రోడ్ల పక్కన లభిస్తున్న ఈ తాటిముంజెలపై ఆసక్తిని కనబరుస్తున్నారు.

రూ.50కి డజన్ ముంజెలు

రాజమహేంద్రవరం నుంచి రాజానగరం వరకూ, వెంకన్నపేట నుంచి కాకినాడ వరకూ, కొవ్వూరు నుంచి ఏలూరు జంక్షన్ వరకూ రోడ్ల పక్కన ఈ తాటి ముంజెలను విక్రయిన్నారు. రంగంపేట, రాజానగరం మండలాలకు చెందిన అనేక మంది ఈ సీజన్‌లో ఇదే వృత్తిగా చేసుకుని జీవనం గడుపుతుంటారు. డజను ముంజెలను కవర్‌లో వేసి రూ.50కు అమ్ముతున్నారు. పల్లెల్లో సైకిళ్లపై ఇంటింటికీ తిరిగి మరీ విక్రయిస్తున్నారు.

పోషకాలు పుష్కలం

కొబ్బరి బొండాలతో పాటు తాటి ముంజెలు కూడా మన శరీరంలో వేసవి తీవ్రత కారణంగా పోతున్న అనేక రకాల పోషకాలను తిరిగి అందిస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. వంద గ్రాముల తాటి ముంజులో 92.5 గ్రాముల తేమ, 6.4 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 0.6 గ్రాముల ప్రొటీన్లు, 0.2 గ్రాముల పీచు పదార్థాలు, 0.1 గ్రాముల కొవ్వు, 61 మి.గ్రా. ఆమ్లం, 12 మి.గ్రా. కాల్షియం, 21 మి.గ్రా. పాస్పరస్, 0.3 మి.గ్రా ఇనుప ధాతువు ఉంటాయి. అలాగే జీర్ణ శక్తిని వృద్ధి చేసి, మలబద్ధకాన్ని నివారించే విటమిన్ ఏ 10 శాతం, విటమిన్ సీ 20 శాతం, కలక్యూమ్ 8 శాతం, ఐరన్ 6 శాతం ఉంటాయి. వేసవి తాపాన్ని తీర్చేందుకు, శరీరంలో శక్తిని నింపేందుకు తాటి ముంజెలు ఉపయోగపడతాయి. వీటిని తినడం వల్ల వేసవి తాపం తీరడంతో పాటు శరీరానికి అవసరమైన క్యాలరీలు కూడా లభిస్తాయి. వీటిని ముఖానికి ఫేస్‌ప్యాక్‌గా కూడా ఉపయోగిస్తారు. దానివల్ల ముఖంలో అలసట పోతుందని, మృదువుగా మారుతుందని చెబుతారు.

చాకిరీ ఎక్కువ, రాబడి తక్కువ

తాటి చెట్లు ఎక్కి కాయలను కోయడం ఒక ఎత్తు అయితే, వాటిని తీసుకువెళ్లి రోడ్ల పక్కన పెట్టి అమ్మడం మరొక ఎత్తు. తాటి కాయలను పదునైన కత్తితో నైస్‌గా చెక్కి మంజెలను జాగ్రత్తగా బయటకు తీయాలి. ఆ విధంగా తీసిన వాటిని 12 (డజను) చొప్పున కవర్లలో వేసి అమ్ముతున్నాం. ఈ క్రమంలో చాకిరీ ఎక్కువగానే ఉంటుంది. రాబడి మాత్రం అంతంత మాత్రమే. రోజుకు రూ. 500పైబడి ఆదాయం వస్తుంది.

– ఊతాడ ఏసు, కోలమూరు

వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన శివతో ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 25వ డివిజన్‌కు చెందిన టీడీపీ డివిజన్ అధ్యక్షుడు గునపర్తి శివ వైఎస్సార్ సీపీలో చేరారు. ఎంపీ కార్యాలయంలో ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ సమక్షంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. శివతో పాటు పార్టీలో చేరిన ఆయన మిత్ర బృందానికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారందరూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ పరిశీలకుడు రావిపాటి రామచంద్రరావు, పార్టీ నాయకులు నందెపు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు పాలిక శ్రీనివాస్, తమ్మారావు పాల్గొన్నారు.

మంత్రి వేణు పరామర్శ



పద్మావతి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి వేణు

రాజమహేంద్రవరం సిటీ: మాతృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు మేడా గురుదత్త ప్రసాద్‌ను మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ శనివారం పరామర్శించారు. స్థానిక జెండాపంజా రోడ్డులోని గురుదత్త ప్రసాద్ నివాసంలో ఆయన మాతృమూర్తి పద్మావతి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు.

రాష్ట్రానికి కేంద్రం చేసిందేమీ లేదు

సీటీఆర్ఐ: కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.13 వేల కోట్లు విడుదల చేస్తుందని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు ఎదురుచూశారని, అయితే కేవలం రూ.7 కోట్లు మాత్రమే విడుదల చేసి కేంద్రం చేతులు దులుపుకొందని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం చేసిందేమీ లేదని విమర్శించారు. భూమిలేని ఎస్సీ, ఎస్టీ నిర్వాసితులకు ఒక్కొక్కరికి కనీసం ఎకరం భూమి ఇవ్వాలని కొత్త భూసేకరణ చట్టం చెబుతుందన్నారు. సమావేశంలో ఆదివాసీ మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

పేపర్ మిల్లు ఉద్యోగి మృతి

కంబాలచెరువు: స్థానిక పేపర్ మిల్లు క్వార్టర్‌లో నివాసం ఉంటున్న మిల్లు ఉద్యోగి చెల్లుబోయిన విజయ భాస్కర్ (38) శనివారం మృతి చెందాడు. ఆయన మిల్లులో సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. విధులకు హాజరుకాకపోవడంతో సహ ఉద్యోగి ఆయన క్వార్టర్‌కు వెళ్లి తలుపు తట్టాడు. లోపల నుంచి ఎటువంటి స్పందనా లేదు. దీంతో అనుమానం వచ్చి బలవంతంగా తలుపులు తెరిచి చూసే సరికీ విజయ భాస్కర్ విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు, పేపరు మిల్లు ఉద్యోగులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విజయభాస్కర్ న్యూరోఫిట్స్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని, ఆ కారణంగానే మృతి చెందిఉంటాడని భావిస్తున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.